సాక్షి వనపర్తి


బుధవారం : 30 : జూలై : 2025



అంతే నిర్లక్ష్యం..

పోలేపల్లి సెజ్‌లో రసాయన వ్యర్థాలు పొలాల్లోకి వదులుతున్నారని పరిసర రైతులు చెబుతున్నారు.

వివరాలు 8లో ▸



పెరుగుతున్న వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద మంగళవారం కాస్త పెరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /22.8

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్హులైన నేత కార్మికులకు రుణమాఫీ వర్తింపు

వనపర్తి: జిల్లాలోని నేత కార్మికులు 2017, ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2024 మధ్యకాలంలో రుణాలు పొంది బ్యాంకులకు పూర్తిగా తిరిగి చెల్లించిన వారు రుణమాఫీకి తగిన ఆధారాలతో చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్యను సంప్రదించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నిర్ణీత గడువులోగా జిల్లావ్యాప్తంగా రుణాలు తీసుకున్న వారు 252 మంది ఉండగా.. తిరిగి బ్యాంకులకు చెల్లించిన వారు 86 మంది కార్మికులు ఉన్నారన్నారు. వీరి వివరాలను ప్రభుత్వానికి పంపించామని, ఇంకా ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో ఏడీ గోవిందయ్య సెల్‌నంబర్ 95737 30056 సంప్రదించాలని పేర్కొన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తించాలని.. ఏ ఒక్కరూ నష్టపోవడానికి వీలు లేదని తెలిపారు. గరిష్టంగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



వనపర్తిటౌన్: హన్మకొండలో ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో జూనియర్, సబ్ జూనియర్ అండర్–14, 16, 18 జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాడు పీడీ నారాయణదాసు శిక్షణలో అనేకమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు ప్రాతినిధ్యం వహించి వనపర్తికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చేందుకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది అథ్లెటిక్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మోహన్‌లాల్, కార్యదర్శి శ్రీకాంత్, పీడీలు మంజుల, రాధిక, సునీత, యువరాజు, బస్వరాజు, మహేష్, శ్రావణ్, దామోదర్, స్వామి, రాజశేఖర్, నరేష్, రాజప్ప, నవీన్, తిరుపతి, జబ్బార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

బిజినేపల్లి: వట్టెం నవోదయ విద్యాలయంలో 2026– 27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనుండగా దానిని ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 13లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీధి వ్యాపారుల సంఘాలు

ఆత్మనిర్భర్ భారత్‌లో మరో ముందడుగు



జిల్లాకేంద్రంలో వీధి విక్రయదారుతో మాట్లాడుతున్న మెప్మా అధికారులు

- పురపాలికల్లో కొత్తగా ఏర్పాటు
- ఐదు మున్సిపాల్టీలు.. 6,463 మంది వీధి విక్రయదారులు
- మహిళా పొదుపు సంఘాల తరహాలో..
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరచింత: కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ పథకంలో భాగంగా చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా చిన్న మొత్తంలో రుణాలు ఇప్పించి ఆదుకుంది. రూ.పది వేల నుంచి మొదలైన రుణం.. ప్రస్తుతం రూ.20 వేలు, రూ.50 వేల రూపాయల వరకు బ్యాంకులు ఇస్తుండటంతో తమ వ్యాపారాలను పెంపొందించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 6,463 మంది వీధి విక్రయదారులు బ్యాంకుల్లో రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటూ క్రమం తప్పకుండా నెలనెలా కిస్తులు చెల్లిస్తూ తిరిగి రుణాలు పొందుతున్నారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో కేంద్రం వీధి విక్రయదారులకు మరో అవకాశం కల్పిస్తూ సంఘాలు ఏర్పాటుచేసి ఎక్కువ మొత్తంలో రుణం ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా మెప్మా అధికారులు పురపాలికల్లో వీధి విక్రయదారులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి సంఘంలో 5 నుంచి 10 మంది సభ్యులు ఉండేందుకు అవకాశం కల్పించడంతో వీధి విక్రయదారుల సంఘాల ఆవిర్భావానికి అంకురార్పణ జరిగినట్లయింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 50కి పైగా గ్రూపులను ఏర్పాటు చేసినట్లు మెప్మా అధికారులు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు..

ప్రస్తుతం కొనసాగుతున్న మహిళా సంఘాల మాదిరిగానే వీధి విక్రయదారులను జత చేస్తూ సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాల్లో 10 నుంచి 15 మంది సభ్యులు ఉండటం తెలిసిందే. ఇదే తరహాలో వీధి విక్రయదారులు తమకు అనుకూలంగా ఉండే వారితో జత కలిసి సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతి సంఘంలో కనీసం 5 మంది సభ్యులు ఉండాలనే నియమం ఉంది. మహిళా సంఘాల్లో సభ్యులు ఒక్కొక్కరు ప్రతి నెల రూ.100 నుంచి రూ.200 పొదుపు చేస్తున్నట్లుగానే వీరుకూడా ప్రతినెల కొంత మొత్తం జమ చేయాలని మెప్మా అధికారులు సూచిస్తున్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న రుణాల మాదిరిగానే వీరికి కూడా భవిష్యత్‌లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు.

ఎక్కువ రుణాలు పొందే అవకాశం..



వీధి విక్రయదారులతో సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతాలు తెరిపించడంతో అనుకున్న రుణం కన్నా ఎక్కువ మొత్తం ఇప్పించే అవకాశం ఉంది. ప్రస్తుతం మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న రుణాల మాదిరిగా భవిష్యత్‌లో వీరి పొదుపును దృష్టిలో ఉంచుకొని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుంది. వీధి విక్రయదారులకు అవగాహన కల్పిస్తూ సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బాలరాజు, జిల్లా కో–ఆర్డినేటర్, మెప్మా

జాబితా రూపకల్పనలో అధికారులు..

ఇంతవరకు వీధి విక్రయదారులకు వ్యక్తిగతంగా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించిన అధికారులు ప్రస్తుతం గ్రూప్ రుణాలు ఇప్పించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గతంలో వ్యక్తిగతంలో రూ.50 వేల రుణాలు ఇవ్వగా.. గ్రూప్‌లో ఉన్న చిరు వ్యాపారులకు ఒకేసారి రూ.10 లక్షల వరకు రుణం అందించే వీలుందని వెల్లడిస్తున్నారు. ఇందుకోసం మెప్మా ఆర్పీలు తమ క్లస్టర్ పరిధిలో బ్యాంకు రుణం పొంది సకాలంలో చెల్లిస్తున్న వారి జాబితాను సిద్ధం చేసి వారితో సంఘాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు.

చిరు వ్యాపారులకు అవగాహన..

చిరు వ్యాపారులు గ్రూప్‌లుగా ఏర్పడితే కలిగే ప్రయోజనాలను ఆయా పురపాలికల్లోని మెప్మా కో–ఆర్డినేటర్లు అవగాహన కల్పిస్తున్నారు. వీరితో పాటు ఆర్పీలు సైతం సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. 15 రోజుల్లో వనపర్తి పురపాలికలో 14, కొత్తకోటలో 7, పెబ్బేరులో 5, ఆత్మకూర్‌లో 6, అమరచింత పురపాలికలో 4 సంఘాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో వీధి విక్రయదారుల సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం



విద్యార్థులతో కలిసి పాఠశాలకు బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట రూరల్: కానాయపల్లి నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కరించి గ్రామ తరలింపు చేపడతామని.. శంకర సముద్రం కుడి కాల్వ ద్వారా 12 గ్రామాల్లోని 8 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కానాయపల్లి పునరావాస కేంద్రంలో రూ.43.50 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా రూ.75 లక్షలో నిర్మించే వడ్డెర, యాదవ, హమాలీ సామూహిక మందిరాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సువిశాల ప్రాంతంలో సకల సౌకర్యాలతో పాఠశాల నిర్మించినట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పునరావాస కేంద్రం, ఆయకట్టుకు సాగునీరు అందించలేదని విమర్శించారు. తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముందుగా ప్రాథమిక పాఠశాలను ప్రారంభించానని చెప్పారు. గ్రామం నుంచి పాఠశాల దూరమైనందున విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా త్వరలోనే నిర్వాసితులకు ప్లాట్లు ఇచ్చి రావాల్సిన నష్టపరిహారం సైతం అందించి పునరావాస కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పునరావాస కేంద్రంలో కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్చామని.. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాలలో ఏఐ విద్య అందించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మహ్మద్ అబ్దుల్ ఘనీ, మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, బోయేజ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పుర కమిషనర్ సైదయ్య, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

కొత్తకోట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పక్కాగా అమలు చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులు కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిపి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 1,018 కొత్త రేషన్ కార్డులు, అదేవిధంగా పాత రేషన్ కార్డుల్లో భార్యా పిల్లల పేర్లు చేర్చి మొత్తం 4,340 కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పుర కమిషనర్ సైదయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రశాంత్, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల పటిష్టతకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్: రాష్ట్రంలోని గురుకులాల పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మండలంలోని చిట్యాల శివారు ఎంజేపీ గురుకుల పాఠశాల పీఎంశ్రీ నిర్వహణలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. పీఎంశ్రీ, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 5వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని మంగళవారం జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఎంశ్రీ బెస్ట్ పాఠశాలగా చిట్యాల ఎంజేపీ గురుకులం ఎంపిక కావడానికి కృషి చేసిన పాఠశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను తమ ప్రభుత్వం రెట్టింపు చేసిందన్నారు. పాఠశాల సముదాయంలో ఇంటర్ కళాశాల భవన నిర్మాణం చేపట్టాలని, సీసీ రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్ గురువయ్యగౌడ్ వినతి పత్రం అందజేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్, సీసీ రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్ గురుకుల కళాశాల భవన నిర్మాణానికి రూ.10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని.. తమ ప్రభుత్వ హయంలో పూర్తిస్థాయిలో పటిష్టపరుస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, రవి, రఘుపతిరావు, రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

ఆత్మకూర్: రైతులు తక్కువ పెట్టుబడితో ఆయిల్‌పాం సాగు చేసి అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరేపల్లి రైతు వేదికలో పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని.. ఎకరాకు 57 మొక్కలు అవసరమని, రూ.1,100 డీడీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నాలుగేళ్ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని.. ఇందుకు కావాల్సిన నిధులను చెల్లిస్తుందని వివరించారు. అలాగే లక్ష్మీకాంత్‌రెడ్డి 40 ఎకరాల్లో సాగుచేసిన ఆయిల్‌పాం తోటను రైతులతో కలిసి సందర్శించారు. నాలుగేళ్ల తర్వాత ఎకరాకు రూ.68 వేల ఆదాయం సమకూరిందని.. 40 ఎకరాలకు రూ.20.40 లక్షలు సంపాదించినట్లు రైతు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, ప్రీ యూనిక్ కంపెనీ మేనేజర్ కేతన్‌రెడ్డి, ఏఈఓ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. మంగళవారం సముద్రమట్టానికి పైన 1,019 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 200 క్యూసెక్కుల వరద జలాశయానికి కొనసాగుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 823 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వకు 17 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటికి 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

అందుబాటులోకి ఆధునిక వృత్తివిద్య కోర్సులు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇతర అధికారులు

వనపర్తి: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని.. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) నెలకొల్పి వాటిలో ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. ఈ ఆధునిక వృత్తి విద్య కోర్సుల్లో రెండోవిడత ప్రవేశాలు ప్రారంభమయ్యాయని.. జిల్లాలో మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ (40 సీట్లు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (24 సీట్లు), బేసిక్ డిజైనర్ మరియు వర్చువల్ వెరిఫైర్ మెకానికల్ (24 సీట్లు), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ (20 సీట్లు), అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిషన్ టెక్నీషియన్ (24 సీట్లు), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ (40 సీట్లు) ఉన్నాయని వివరించారు. వీటితో పాటు రెగ్యులర్ కోర్సులైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, సీఓపీఏ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని చెప్పారు. దరఖాస్తునకు 31వ తేదీ వరకు గడువు ఉందని.. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ http://iti.telangana.gov.in, లేదా సెల్‌నంబర్ 94902 02037, 98492 44030, 79953 35372 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, టీగెట్ చంద్రశేఖర్‌గౌడ్, ఏఎల్‌ఓ వేణుగోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి



మొక్కలు నాటుతున్న నారాయణరావు

అమరచింత: పురపాలికకు ఆదాయం సమకూర్చే ఆస్తి, వాణిజ్య, కొళాయి పన్నులను క్రమం తప్పకుండా వసూలు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు ఆదేశించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా పురపాలికలోని 4వ వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి పరిసరాల శుభ్రత, తాగునీటి సరఫరాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పుర కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం పుర సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆగస్టు చివరి నాటికి 40 శాతం పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొళాయి పన్నును సైతం క్రమం తప్పకుండా వసూలు చేయాలని.. వీటితోనే పుర అభివృద్ధితో పాటు కార్మికుల వేతనాలు చెల్లించే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు. ప్రతి వీధిలో స్ట్రీట్ లైట్లు నిత్యం వెలిగేలా చూడాలని, మెప్మా సిబ్బంది పట్టణ మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడంతో పాటు సకాలంలో తిరిగి చెల్లించేలా ప్రతినెల సమావేశాలు నిర్వహించాలన్నారు. కొత్త సభ్యులతో సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పుర కమిషనర్ నాగరాజు, మేనేజర్ యూసుఫ్, మెప్మా జిల్లా కో–ఆర్డినేటర్ బాలరాజు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

- విద్యతోనే బాలలకు బంగారు భవిష్యత్
- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: అన్ని ప్రభుత్వ శాఖల సమష్టి కృషితోనే మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించవచ్చని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జూలై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ భవనంలో యాక్సెస్ టు జస్టిస్‌లో భాగంగా జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ మరియు మహిళ, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా సఖి, భరోసా, ఆపరేషన్ ముస్కాన్, షీటీం, లీగల్ సర్వీసెస్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, జిల్లా వైద్యాధికారి, జస్టిస్ జోనల్ బోర్డ్ తదితర శాఖలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మానవ అక్రమ రవాణాకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, దర్యాప్తు విధానం, న్యాయపరమైన సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు చనిపోవడంతో చదువు మానేసిన మహేష్ చెత్త కాగితాలు ఏరుకుంటున్న మహేష్‌ను 2022లో ఆర్డీఎస్ సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ చేరదీసి పాఠశాలలో చేర్పించారు. 2025లో జరిగిన పదోతరగతి పరీక్షల్లో 480 మార్కులు సాధించి ఆదర్శంగా నిలవడంతో మహేష్‌ను ఎస్పీ శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగం సాధించి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ అనే స్వచ్ఛంద సంస్థ పని చేస్తుందని తెలిపారు. ఇలాంటి కేసులు మొదటగా గుర్తించేది పోలీస్‌శాఖ కాబట్టి వీటిపైన పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే జిల్లా పరిధిలో మానవ అక్రమ రవాణా జరగకుండా అరికట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి కఠిన చట్టాలు ఉన్నాయని.. నేరస్తులను శిక్షించవచ్చని తెలిపారు. రోజు గ్రామాల్లో సందర్శిస్తూ మానవ అక్రమ రవాణా, బాల కార్మికులను గుర్తించే చర్యలు కొనసాగాలన్నారు. మానవ అక్రమ రవాణా జరిగితే ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్‌లైన్ 1098, డయల్ 100, 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చెన్నమ్మ థామస్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ అంజద్, ఆపరేషన్ ముస్కాన్ ఎస్ఐ రాము, జస్టిస్ జువనైల్ బోర్డు సభ్యురాలు గిరిజ, మానసిక వైద్యురాలు పుష్పలత, సఖి కో–ఆర్డినేటర్ కవిత, భరోసా కో–ఆర్డినేటర్ శిరీష, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వనజ, విజయ్, భరోసా, సఖి, ఆపరేషన్ ముస్కాన్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తేళ్లు కుట్టని పంచమి



అరచేతిలో తేలు.. ఆనందంలో యువతి





తేలు కొండి పట్టుకున్నా కుట్టలే.. నాలుకపై తేలు వేసుకుంటూ..



కొండమవ్వను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

తేళ్లను చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎక్కడ కుడతాయోనన్న భయంతో ఆమడదూరం పారిపోతాం. కానీ.. తేలు కుట్టని రోజంటూ ఒకటుందని మీకు తెలుసా.. అదే తేళ్ల పంచమి. ఈ రోజు తేలును పట్టుకున్నా.. ఒంటిపై, చెంపపై, చేతిపై వేసుకున్నా.. ఏకంగా నాలుకపై పెట్టుకున్నా ఏమీ చేయని అరుదైన దృశ్యాలు కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా కందుకూరులో చూడవచ్చు. మంగళవారం నాగుల పంచమి నాడు కొండమవ్వ గుట్టపైకి వందలాది మంది తరలివెళ్లి తేళ్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై రాళ్ల కింద, చెట్ల పొదల్లో ఉన్న తేళ్లను చిన్నా, పెద్ద తేడా లేకుండా పట్టుకొని సందడి చేశారు. తేళ్ల పంచమి జరుపుకోవడంతో తేళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చని వారి నమ్మకం. తేళ్ల పంచమి జాతరకు వేలాది మంది తరలిరావడంతో గుర్మిట్కల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– నారాయణపేట

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోళీపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎదిరె కృష్ణ(బంగారి(30), భార్య మంగమ్మకు తరచూ సంసారం విషయంలో గొడవ జరిగేది. దీంతో మంగమ్మ తన తల్లితండ్రుల వద్దే ఉంటుంది. ఇంటికి రావాలని తరచుగా భర్త అక్కడికెళ్లి గొడవపడే వాడు. సోమవారం మంగమ్మ ఆస్పత్రికి వెళ్లి మహబూబ్‌నగర్‌లోని తన పెద్దమ్మ బాలకిష్టమ్మ వద్ద ఉన్నది. ఇదిలా ఉండగా.. మంగళవారం కృష్ణ సోళీపురంలోని తన ఇంట్లో కొండికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన మృతుడి తండ్రి వెంకటయ్య మంగమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె వచ్చి ఖిల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దేరంగుల వెంకటయ్య(52) మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ట్రాక్టర్‌లో రాయిని దించి తిరిగి ఇంటికి వస్తుండగా.. మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తాపడడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడినికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. వనపర్తి జిలా ఖిల్లాఘనపురం మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన లట్టుపల్లి రామకృష్ణ(25) రెండేళ్ల క్రితం ఇంట్లో చెప్పకుండా వచ్చి జడ్చర్లలోని ఇందిరానగర్ కాలనీలో అంజలితో సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జడ్చర్లకు వచ్చి రామకృష్ణను అప్పిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. తర్వాత మళ్లీ ఎవరికీకి చెప్పకుండా ఇంటినుంచి వచ్చాడు. అనంతరం మంగళవారం ఇందిరానగర్‌లోని అంజలి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహబూబ్‌నగర్ 300 ఆలౌట్

సెంచరీతో రాణించిన అబ్దుల్ రాఫే



అబ్దుల్‌రాఫే (111 పరుగులు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన బి–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెరుగైన స్థితిలో ఉంది. వెస్ట్‌మారేడ్‌పల్లి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసి 85.1 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే (194 బంతుల్లో 10 ఫోర్లతో 111 పరుగులు) అద్భుతమైన సెంచరీతో రాణించాడు. జట్టులో బి.సంజయ్ (53), కేతన్‌కుమార్ (43), కొండ శ్రీకాంత్ (30) సత్తా చాటారు. ప్రత్యర్థి బౌలర్లలో తరుణ్‌చంద్ర 3, సజ్జా సాయి ప్రణవ్, సిద్దార్థ రెండేసి వికెట్లు తీసుకున్నారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లి జట్టు బ్యాటింగ్ చేపట్టనుంది.

అదే కాలుష్యం.. అంతే నిర్లక్ష్యం



పరిశ్రమలో కలుషిత నీటిని పరిశీలిస్తున్న అధికారులు

- పోలేపల్లి సెజ్ పరిశ్రమల్లో వెలుగుచూసిన నిజాలు
- కలెక్టర్ ఆదేశంతో అధికారుల విస్తృత తనిఖీలు
- మీ తీరు మారదా.. అంటూ కంపెనీ ఇన్‌చార్జ్‌లపై ఆగ్రహం
- తనిఖీల సమాచారం తెలుసుకొని కంపెనీలు అప్రమత్తం
- కొన్ని పరిశ్రమల్లో గేట్లు వేసి అధికారులను లోపలికి రానివ్వని వైనం



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజాపూర్: పరిశ్రమల నుంచి వ్యర్థాలను.. కలుషిత, రసాయన నీటిని పొలాల్లోకి వదులుతున్నారని.. పంటలు వేసినా పండడం లేదని.. కంపెనీల నుంచి వచ్చే పొగతో వాయుకాలుష్యం అవుతుందని.. ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నామంటూ పోలేపల్లి సెజ్ పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తాజాగా ప్రజావాణిలో పలు గ్రామాల రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీలు చేయగా.. అదే కాలుష్యం.. అంతే నిర్లక్ష్యంతో సదరు కంపెనీలు, సిబ్బంది వ్యవహరించడం కనిపించింది. యథేచ్ఛగా పొలాల్లోకి కలుషిత నీటిని వదలడంతో అధికారులు హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ మండలం రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల రైతులతో పాటు జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామ రైతులు కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విజయేందిరబోయి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, జిల్లా ఇండస్ట్రియల్, వ్యవసాయశాఖ, గ్రౌండ్‌వాటర్ అధికారులను కమిటీ వేసి వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

విస్తృత తనిఖీలు..

దీంతో మంగళవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పీసీబీ ఈఈ సురేష్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావ్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమల్లో నుంచి వ్యర్థాలను రైతుల వ్యవసాయ పొలాల్లోకి వదిలే రంధ్రాలను గమనించి వెంటనే వీటిని మూసివేయాలని ఆయా పరిశ్రమల ప్లాంట్ ఇంచార్జ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా సంబంధిత అధికారులకు ఎన్నో పర్యాయాలు ఫిర్యాదులు చేస్తున్నా.. వారు పరిశ్రమల నుంచి యథావిధిగా మా పొలాల్లోకి కాలుష్యపు జలాలు వదులుతున్నారని పోలేపల్లి రైతు రఘునందన్‌చారి అధికారులకు గోడు విన్నవించారు. ఓ పరిశ్రమలో అధికారులు తనిఖీలు చేస్తుండగా.. సమాచారం అందుకున్న మిగతా పరిశ్రమల ఇంచార్జ్‌లు అప్రమత్తమయ్యారు. పరిసరాలు శుభ్రంగా చేయడంతోపాటు కాలుష్యం కానరాకుండా చేశారు. ఇదిలాఉండగా, అధికారులు లోపలికి వెళ్లకుండా హెటిరో పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో వ్యవసాయశాఖ అధికారులు పరిశ్రమ గేటు బయటే ఉండిపోయారు.

పంటలు పండడంలేదంటూ రైతుల ఆవేదన

ఈ పరిశ్రమల మూలంగా జల, వాయు కాలుష్యంతో తాము వ్యవసాయం చేయలేక, చేసినా పంటలు పండక ఇబ్బందులు పడుతున్నామని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల రైతులు అధికారుల ముందు వాపోయారు. ఇక్కడ ఏం జరుగుతుందో తమకు అంతా తెలుసని, ఎన్నిసార్లు చెప్పినా తమ తీరు మార్చుకోరా అంటూ అధికారులు పరిశ్రమల ఇంచార్జ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫార్మా పరిశ్రమతో కాలుష్యం అంతకంతా పెరిగిపోయి ఇబ్బందులు పడుతుంటే కొత్తగా బాలాక్సీ అనే పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారని రైతులు తెలిపారు. దీంతో ఆ పరిశ్రమను సైతం పరిశీలించి పరిశ్రమలో పీసీబీ అనుమతులు లేకుండా పెద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడంతో పొల్యుషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్ గుర్తించారు. దీనిని నిర్మించేందుకు అనుమతులు ఉన్నాయా అంటూ పశ్నించారు. ఇంకుడు గుంతలు నిర్మించి కాలుష్య జలాలను వాటిలో వదులుతుండటంతో తమ వ్యవసాయ బోర్లలోని భూగర్భజలాలు కలుషితవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇలాంటి కాలుష్యం వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు.

జూరాలకు పెరుగుతున్న వరద



సుంకేసుల నుంచి దిగువకు పారుతున్న వరద

12 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 1.34 లక్షల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో 1.40 లక్షల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్లు పైకెత్తి 1,19,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు చెప్పారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27,395 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 600, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.817 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 172.074 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 204.431 మి.యూ. విద్యుదుత్పత్తి చేశామని.. ఇప్పటి వరకు 376.505 మి.యూ, విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు 1.25 లక్షల క్యూసెక్కులు..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం 90 వేల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం లక్ష క్యూసెక్కులు దాటింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 1.25 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 10 గేట్లు ఒక మీటర్ మేర, మరో 11 గేట్లను 2 మీటర్ల మేర పైకెత్తి 1,22,326 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలివ్వాలి



జ్యోతి ప్రజ్వల చేస్తున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళ సాధికారితకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలని సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన బ్యాంకర్లు, డీపీఎం, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం బ్యాంకర్లు రుణాలివ్వాలన్నారు. రుణాలివ్వకుంటే మహిళా సంఘాల సభ్యులు మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తారని దీంతో మరో ప్రమాదం ఉందని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను కచ్చితంగా చెల్లిస్తారని.. వారి నుంచి వందశాతం రుణాలు రికవరీ అవుతాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 2025–26 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యం రూ.385 కోట్లు పెట్టినట్లు ఈ మొత్తం 9854 మహిళ సంఘాలకు ఇవ్వాలన్నారు. ఈ మొత్తం లక్ష్యం పూర్తి అయ్యేటట్లు బ్యాంకర్లు సహకరించాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటిని తిరిగి చెల్లించేలా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్‌డీఓ నర్సిములు, డీఆర్‌డీఓ ఏపీడీ శారద, డీపీఎం లక్ష్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కోనేరులోకి చేరిన నీరు

గుండాల కోనేటికి జలకళ

వెల్దండ: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని గుండాలలో ఉన్న అంబా రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు జలకళను సంతరించుకుంటుండటంతో భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకుంటున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా కల్వకుర్తి జేపీనగర్‌లో చదివే ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు కోనేరులో మునిగి మృతిచెందాడు. ఆ సమయంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం మోటారు సాయంతో మూడు రోజుల పాటు కోనేటిలోని నీటిని బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోనేరు సుమారు 160 గడుల లోతు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి కోనేరు ఖాళీగా ఉండటంతో ద్వారాలు మూసివేశారు. వర్షాకాలం కావడంతో నీరు కొద్ది కొద్దిగా ఉబికి వస్తుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణ మాసం కావడంతో కోనేటిలో స్నానాలకు అనుమతించాలని భక్తులు దేవాదాయశాఖ అధికారులను కోరుతున్నారు. వివాహం, సంతానం లేని వారు ఇక్కటి కోనేటిలో స్నానం చేసి శివలింగానికి అభిషేకం చేస్తే ఫలితం ఉంటుందని భక్తుల నమ్మకం.



ఖాళీగా ఉన్న కోనేరు (పాత చిత్రం)

అటవీ సంపద పెంపునకు సహకరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అటవీ సంపద పెంపునకు సామిల్, టింబర్ డిపోల యాజమానులు సహకారం అందించాలని జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జోగులాంబ జోన్ సామిల్స్, టింబర్ డిపోల యాజమానుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలప అక్రమ రవాణాను ఎవరూ ప్రోత్సహించవద్దని కోరారు. ప్రభుత్వం అడవుల శాతాన్ని పెంచేందుకు అన్ని శాఖల సమన్వయంతో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా విరివిగా మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతి లేనిది కలప రవాణా, నిల్వ చేయవద్దని సూచించారు. అనంతరం డీఎఫ్ఓ సత్యనారాయణను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ నాయకులు రమణయ్య, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్ నాయకులు నవీన్‌పటేల్, సిద్దిఖ్, శేషుకుమార్, ముస్తఫా, ముఖేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



డీఎఫ్ఓ సత్యనారాయణను సన్మానిస్తున్న డిపోల యాజమానులు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



రోగితో మాట్లాడుతున్న ఫణీంద్ర రెడ్డి

పాలమూరు: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీజీఎంఎస్ఐడీసీ చైర్మన్ ఫణీంద్ర రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. మొదట జనరల్ మెడిసిన్ పురుషుల, మహిళల వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం డైట్ విభాగాన్ని సందర్శించి ఆహార పదార్థాలను, నిల్వ ఉన్న కూరగాయాలు, ఇతర కిరాణ సామాన్ల స్టాక్‌ను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎంసీహెచ్ బ్లాక్, సీటీ స్కాన్, పోస్ట్ ఆపరేటీవ్ వార్డు, సెంట్రల్ డ్రగ్‌స్టోర్, ఆస్పత్రిలోని మెయిన్ డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో కావాల్సిన మందులను, పడకలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు నిత్యం శానిటైజేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డీవీవో పద్మజా, నారాయణపేట కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, అమరావతి, శశికాంత్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

'బీజేపీలో బీసీలకు సముచిత స్థానం'

పాలమూరు: రాష్ట్రంలో బీజేపీ బీసీలకు సముచిత స్థానం కల్పించిందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, పార్లమెంట్ అధికార ప్రతినిధి మెట్టుకాడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో మహబూబ్‌నగర్‌లో బీసీలపై అక్రమంగా కేసులు పెట్టి.. జైళ్లకు పంపించినప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న బీసీ సంఘాల నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కుల సంఘాల ముసుగులో రాజకీయ అజెండాను పంచుకోవడం సరికాదన్నారు. పట్టణంలో మాజీ మంత్రి బాధితులు బీసీలు ఎంతో మంది ఉన్నారని వారందరికీ ఆనాడు డీకే అరుణ అండగా నిలిచారని గుర్తు చేశారు. గత ఎంపీ ఎన్నికల్లో శాంతికుమార్ పోటీ చేయడానికి ప్రయత్నించారని, కానీ, పార్టీ డీకే అరుణకు టిక్కెట్ ఇచ్చిందని పేర్కొ న్నారు. ఆ సమయంలో కొందరు పార్టీకి రాజీనా మా చేసి బీజేపీకి వ్యతిరేకంగా పనిచేశారనే అంశాన్ని ఎంపీ డీకే అరుణ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారన్నారు. పార్టీ అంతర్గత అంశాన్ని కొందరు స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచనతో కుల సంఘాల వేదిక పంచుకోవడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో శాంతికుమార్‌కు పార్టీ మంచి సముచిత స్థానం కలిప్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, యా దయ్య, గంగన్న, శివలింగం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి అన్నదాన సత్రం

- రేపు ప్రసాద్ స్కీం భవంతిలోకి మార్పు
- నాలుగు నెలల క్రితమే అలంపూర్ ఆలయాలకు అప్పగింత
- వర్చువల్‌గా భవనాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ



అలంపూర్ అన్నదాన సత్రం కోసం సిద్ధమైన ప్రసాద్ స్కీం భవనం

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో అన్నప్రసాదానికి కొత్త భవనం అందుబాటులోకి రానుంది. ప్రసాద్ స్కీం నిధులతో నిర్మించిన భవంతిలోకి బాలబ్రహ్మేశ్వరస్వామి అన్నదాన సత్రం ఏర్పాటుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ అర్చక స్వాములు ఖరారు చేసిన ముహూర్తంలో అధికారులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం భక్తులకు కొత్త భవనంలో అన్నప్రసాదం వసతి అందుబాటులోకి తీసుకురానున్నారు.

50 ఏళ్లుగా అన్నదాన సత్రం..

అలంపూర్ క్షేత్రంలో 50ఏళ్లుగా శ్రీగంద్రకోట కుమారశాస్త్రి బాలబ్రహ్మేశ్వరస్వామి అన్నదాన సత్రం పేరుతో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నదాన సత్రం పురావస్తుశాఖ అధ్వర్యంలో ఉంటుంది. ఈ క్షేత్రందినదినాభివృద్ధి చెంది భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ.. సత్రంలో 50నుంచి 100 మంది వరకు మాత్రమే భోజనం చేయడానికి అవకాశం ఉంది. దీంతో అన్నప్రసాదం పొందడానికి భక్తులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. పాత అన్నదాన సత్రంలో మార్పులు చేయడానికి పురావస్తు శాఖ నుంచి అనుమతులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అసౌకర్యాల నడుమే సత్రం కొనసాగుతోంది.

రూ. 37కోట్ల వ్యయంతో కొత్త భవంతి..

కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా రూ. 37కోట్లు మంజూరు చేయడంతో అన్ని హంగులతో భవనం నిర్మించారు. ఈ భవంతిలో ఒక బ్లాక్‌ను అన్నదాన సత్రం కోసం కేటాయించారు. ఇదివరకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ భవంతిని ప్రారంభించడంతో ఆలయాలకు అప్పగించారు. ప్రస్తుతం అన్నదాన సత్రం కోసం కేటాయించిన బ్లాక్‌లో 1000 మంది వరకు కూర్చొని తినడానికి అవకాశం ఉంటుంది. సాధారణ రోజుల్లో ఆలయాలకు 400 మంది వరకు భక్తులు అన్నప్రసాదం కోసం వస్తారని.. సెలవు దినాల్లో 800 నుంచి 1,200 మంది వరకు అన్నప్రసాదం కోసం వస్తారు. మహాశివరాత్రి, దేవీ శరన్నవరాత్రులు, వసంతి పంచమి వంటి ప్రత్యేక రోజుల్లో అన్నప్రసాదం కోసం వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా కొత్త భవనంలో పెద్ద హాల్‌తో పాటు కిచెన్, సరుకుల నిల్వకు ప్రత్యేక గదులు అందుబాటులోకి రానున్నాయి.

నేడు పూజలు.. రేపు ప్రారంభం


ప్రసాద్ స్కీం భవంతిలో అన్నదాన సత్రం ఏర్పాటు సందర్భంగా రెండు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, సంప్రోక్షణ, ఋుత్విక్ వరుణం, మహా కలశ స్థాపన, వాస్తు మండపారాధన, గణపతి, నవగ్రహ, వాస్తు, రుద్ర హోమాలు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున 4:34 గంటలకు గో సహిత గృహప్రవేశం, 11 గంటలకు పూర్ణాహుతి సమర్పణ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆదిదంపతులైన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు అన్నదానం ఉంటుందని ఈఓ తెలిపారు.

అందుబాటులోకి సకల సౌకర్యాలు..



కొత్త భవనంలో అన్నప్రసాదం కోసం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భక్తులు కూర్చొని తినడానికి ఏర్పాటు ఉంటుంది. భక్తుల వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భవిష్యత్‌లో ఇతర బ్లాక్‌లు సైతం అప్పగించే అవకాశం ఉంది. భవనం మొత్తం వినియోగంలోకి వస్తే భక్తులకు మరిన్ని సౌకర్యాలు పెరుగుతాయి.

– పురేందర్ కుమార్, ఈఓ.



ప్రసాద్ స్కీం భవనంలోని అన్నప్రసాద బ్లాక్

భారీ పాము పట్టివేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయిపల్లిలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటి ఆవరణలో భారీ పామును స్నేక్‌క్యాచర్, హోంగార్డ్ కృష్ణసాగర్ పట్టుకున్నారు. కారు పార్కింగ్ స్థలంలో ఉన్న పామును ఇంట్లో పని చేసే వారు గుర్తించి భయాందోళనకు గురై కొత్తకోటలో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణసాగర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే గ్రామానికి చేరుకుని పామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుకున్న పాము జెర్రిపోతు అని.. ఏడు ఫీట్ల పొడవు, 12 ఏళ్ల వయస్సు, నాలుగు కిలోల బరువు ఉంటుందన్నారు. పాములు కనబడితే తనకు సమాచారం ఇస్తే పట్టుకొని అడవిలో వదిలేస్తానన్నారు.

శిశుగృహలో బాలుడి అప్పగింత



గుర్తు తెలియని బాలుడు

మహబూబ్‌నగర్ క్రైం: మూడేళ్ల బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన మంగళవారం చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని ఓ మజీద్ వద్ద గుర్తు తెలియని మూడేళ్ల బాలుడిని ఎవరో వదిలేసి వెళ్లినట్లు మంగళవారం డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి బాలుడిని రక్షించారు. ఎవరైనా యాచకులు వదిలేసి వెళ్లారా? లేక ఇంకా ఎవరైనా వదిలేసి వెళ్లారా అనే అంశంపై విచారణ చేస్తున్నామని తెలిపారు. బాలుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, శిశుగృహలో అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.